

ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు

జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకోని వారి పట్టాలు రద్దు చేస్తామని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు.

- 8లో..



గుడ్ ట్రయల్ మానిటరింగ్‌తో నేరస్తులకు శిక్ష

న్యాయస్థానాల్లో కేసుల విషయంలో అలసత్వం వద్దని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /26

వాతావరణం


ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.



జీవనాడికి ఊపిరి

కరువు నేలను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దుర్భిక్ష ప్రాంతాలకు జీవనాడి అయిన ఈ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు వేగవంత మయ్యాయి. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న పోలవరం ప్రాజెక్ట్‌తో సమానంగా వెలిగొండ పనులను పరుగులు పెట్టిస్తోంది. నిర్దిష్ట వ్యవధిలో పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు పరుగులు తీసేలా అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు.

- ఊపందుకున్న వెలిగొండ ప్రాజెక్ట్ పనులు
- జోరుగా పునరావాసం
- ఇన్‌టెక్ ట్యాంక్ పనుల్లో పుంజుకున్న వేగం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.5,950 కోట్లు ఖర్చు


వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్

మార్కాపురం: ప్రకాశం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లో శాశ్వతంగా కరువు నివారించి సాగు, తాగు నీరందించేందుకు చేపట్టిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఐదు దశాబ్దాల కింద పోరాటం మొదలైంది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా దీనిని పట్టించుకున్న దాఖల్లాలేవు. 1996లో చంద్రబాబు సమాధిరాయిలా శిలాఫలకాన్ని ఆవిష్కరించి గాలికొదిలేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు వేగవతంగా సాగుతున్న సమయంలో వైఎస్సార్ అకాల మరణం తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. 2004 నుంచి వైఎస్సార్ ప్రభుత్వంలో రూ.1448.14 కోట్లు ఖర్చు పెట్టారు. టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. కేటాయించిన బడ్జెట్ ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోయాయి.

వడివడిగా పనులు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలిగొండకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రివర్స్ టెండరింగ్ ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని అరికట్టి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించింది. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ, ఉపకాలువలు, ఉదయగిరి ఉపకాలువ, పడమర ఉపకాలువ, టి-5 కాలువల పనులు పూర్తయ్యాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పునరావాసం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు రూ.5,950 కోట్లు ఖర్చు చేసింది. రెండో దశ కోసం రూ.8052.10 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం, భూ సేకరణ, పునరావాసం, అటవీ భూముల కోసం ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది రూ.856.15 కోట్లు కేటాయించారు.

వేగంగా పునరావాస పనులు:

ముంపు గ్రామాలైన కలనూతల వారికి ఇడుపూరు 1, 2లో, గుండంచెర్ల నిర్వాసితులకు తోకపల్లి వద్ద, సుంకేసుల గ్రామస్తులకు గోగులదిన్నె వద్ద, గొట్టిపడియ, అక్కచెరువు గ్రామస్తులకు వేములకోట వద్ద, సాయిరాం నగర్, రామలింగేశ్వరపురం వాసులకు ఓందుట్ల వద్ద పునరావాస పనులు జరుగుతున్నాయి. ఇదే సమయంలో గొట్టిపడియ వద్ద వెలిగొండ నీటిని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రజలకు అందించేందుకు ఇన్‌టెక్ ట్యాంక్ పనులను వేగంగా చేస్తున్నారు.

■ ప్రాజెక్టు నిర్మాణం ఇలా

శ్రీశైలం ప్రాజెక్టులోని 43.58 టీఎంసీల కృష్ణానీటిని శ్రీశైలం వద్ద ఉన్న కొల్లం వాగు నుంచి 2 టన్నెల్స్ ద్వారా ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలోని 30 మండలాలకు కృష్ణా జలాలు అందించేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు వల్ల 4,47,300 ఎకరాలకు సాగునీరు, 15.25 మంది లక్షల మందికి తాగు నీరు అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల డ్యాంలు పూర్తి కాగా దోర్నాల మండలం కొత్తూరు వద్ద రెండు టన్నెల్ పనులు పూర్తికావొచ్చాయి. రెండు టన్నెల్స్ నిర్మాణంలో భాగంగా ఒక్కొక్క టన్నెల్ 18.8 కిలో మీటర్ల పొడవుతో టన్నెల్స్ నిర్మిస్తున్నారు. మొదటి టన్నెల్ పనులు పూర్తి చేయగా, రెండో టన్నెల్స్ పనులు కూడా వేగంగా చేస్తున్నారు. దివంగత వైఎస్ఆర్ మహా సంకల్పంతో ప్రాజెక్టును ప్రారంభించగా 2014 నాటికి ఒకటో టన్నెల్ 11.50 కిలో మీటర్లు పూర్తికాగా, రెండో టన్నెల్ 9 కిలోమీటర్లు పూర్తయింది. 62 శాతం టన్నెల్ 1 పనులు పూర్తికాగా, 48 శాతం టన్నెలు 2 పనులు పూర్తయ్యాయి. 2014 నుంచి 19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో 1వ టన్నెల్‌కు సంబంధించి కేవలం 2 కిలో మీటర్లు మాత్రమే పనులు జరిగాయంటే ప్రాజెక్టు నిర్మాణం పై చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుంది. అధికారంలోకి వచ్చినా వైఎస్ జగన్ వెంటనే మొదటి టన్నెల్ పూర్తి చేయాలని ఆదేశించడంతో త్వరితగతిన పూర్తి చేశారు.

2014 నుంచి 19 వరకు వెలిగొండ బడ్జెట్	
2014-15లో	రూ. 76.58 కోట్లు
2015-16లో	రూ.153.89 కోట్లు
2016-17లో	రూ.200 కోట్లు
2017 -18లో	రూ.200 కోట్లు
2018-19లో	రూ.334.05 కోట్లు

నాడు తండ్రులు.. నేడు తనయులు

వెలిగొండ ప్రాజెక్టు పనుల ప్రారంభానికి నాడు తండ్రులు తాపత్రయం పడగా పనుల పూర్తిపై వారి తనయులు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని పలు దఫాలుగా కలిసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమై ఊపందుకున్నాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ దీనిని పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతమయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సైతం సీఎం జగన్‌ను కలిసి పనులు పూర్తయ్యేలా కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.


సుంకేసుల వద్ద పనులు ప్రారంభిస్తున్న అప్పటి సీఎం వైఎస్సార్, ఎమ్మెల్యే కొండారెడ్డి (ఫైల్)

త్వరలో వెలిగొండ జలాలు:



టీడీపీ హయాంలో వెలిగొండ నిధులను పార్టీ నేతలు ఏటీఎంగా వాడుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై వారికి చిత్తశుద్ధి లేదు. వెలిగొండ ప్రాజెక్టు విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి సమీక్షలు చేస్తున్నారు. నేను, సహచర ఎమ్మెల్యేలు, మంత్రులం కలసి సీఎం వైఎస్ జగన్‌ను వెలిగొండ ప్రాజెక్టు కోసం కలిశాం. త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. తండ్రి వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టు పనులు ప్రారంభించగా తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. వెలిగొండ జలాలతో ఈ ప్రాంతం మరో కోనసీమ లాగా పచ్చని పైర్లతో, పాడిపంటలతో కళకళలాడుతుంది. కరువు మాటే అప్పుడు వినిపించదు.

- కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే మార్కాపురం

న్యూస్‌రీల్

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- బాధ్యతలు స్వీకరించిన డీఆర్ఓ శ్రీలత


డీఆర్ఓ శ్రీలతకు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టరేట్ ఏఓ, ఇతర సిబ్బంది

ఒంగోలు అర్బన్: జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామిశెట్టి శ్రీలత అన్నారు. శుక్రవారం ప్రకాశం భవనంలోని డీఆర్ఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆమెను కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఓ) శ్రీనివాసరావు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాలు కలిసి పుష్ప గుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం నగరంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు స్థానికంగా జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారన్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి స్థానిక తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీబీ వ్యాధికి అవగాహనతో చెక్


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: టీబీ వ్యాధిపై అవగాహనతో ఉండి తగిన జాగ్రత్తలు వహిస్తే వ్యాధికి చెక్ పెట్టవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్ అధ్యక్షతన నిర్వహించిన క్షయ అవగాహన ర్యాలీని ప్రకాశం భవనం వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు చికిత్సాకాలంలో విధిగా మందులు వినియోగించాలన్నారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమం ద్వారా వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు రూ.500 పౌష్టికాహారం కోసం అందిస్తుందన్నారు. ఆర్టీపీసీఆర్, సిబినాట్ యంత్రాల ద్వారా వ్యాధి కచ్చితంగా ఏ స్థాయిలో ఉందో కూడా నిర్ధారించవచ్చన్నారు. టీబీపై అవగాహనకు మార్చి 24 నుంచి ఏప్రిల్ 13 వరకు ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తారన్నారు. డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా వైద్యులు సూచించినట్లు మందులు కచ్చితంగా వాడితే క్షయ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ర్యాలీ ప్రకాశం భవనం నుంచి రిమ్స్ వరకు కొనసాగింది. అనంతరం రిమ్స్ గ్యాలరీలో క్షయ నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ నీరద, డీఎల్ఏటీ డాక్టర్ సురేష్‌కుమార్, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాంబశివరావు, డాక్టర్ మాధవీలత, డాక్టర్ రంజిత్‌బాషా, డాక్టర్ మణిబాబు, డాక్టర్ పద్మజ, డాక్టర్ జానశ్రీ, టీబీ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్ రత్నకుమారి, డీపీఎం రంగారావు, డాక్టర్ జోసఫ్ శామ్యూల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. టీబీ నివారణకు కృషి చేసిన సిబ్బందికి ప్రత్యేక సేవా పతకాలను అందజేశారు.

ఇంటర్ పరీక్షకు 1069 మంది గైర్హాజరు

ఒంగోలు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం-2బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు శుక్రవారం 1069 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగం పరీక్షలకు 22,123 మందికిగాను 21,368 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 3,114 మందికిగాను 2,800 మంది హాజరయ్యారు. సింగరాయకొండ ఏపీ సాంఘిక సంక్షేమ జూనియర్ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించగా, రాష్ట్ర అబ్జర్వర్ రమణారెడ్డి చీరాలలోని పలు సెంటర్లను పరిశీలించారు. పరీక్షలు పూర్తి ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఒంగోలు: స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో తొలిరోజు జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మాండో ఆనంద్, వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో కలిసి సంయుక్తంగా జాబ్‌మేళాలను నిర్వహించాయి. ముందుగా డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి కనీసం రెండు సంవత్సరాలపాటు శిక్షణ పొందితే ఆ తరువాత బీటెక్ చదివిన విద్యార్థికంటే మెరుగైన ఉపాధి అవకాశాలను సొంతం చేసుకునే సౌలభ్యం ఉందని చెప్పారు. కేవలం విద్యాబోధనే కాకుండా ఉపాధి అవకాశాలను కూడా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. శుక్ర, శనివారాల్లో జరిగే ఈ జాబ్‌మేళాకు చెన్నైకు చెందిన మాండో ఆనంద్ కంపెనీ, తమిళనాడులో 4, ఏపీలోని సత్యవేడులో ఒక యూనిట్ కలిగిన వీల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు రావడం శుభపరిణామమన్నారు. వీల్స్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థల్లో 600 మంది వరకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం హెచ్ఎల్ మాండో ఆనంద్ కంపెనీ, వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు వేర్వేరుగా రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించాయి. హెల్ మాండో కంపెనీ 2020 , 2021, 2022 లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎంపిక నిర్వహించింది. ఇందులో 36 మంది హాజరుకాగా వారిలో 16 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీల్స్ ఇండియా కంపెనీ మాత్రం ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న డిప్లొమా విద్యార్థులకు మాత్రమే ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 152 మంది హాజరుకాగా వారిలో 135 మందిని ఎంపిక చేసుకున్నారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏడాదిపాటు ట్రైనింగ్ ఉంటుందని, స్టైఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత అభ్యర్థి సామర్థ్యాలను బట్టి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఓఎస్‌డీ తిప్పేస్వామి, డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ట్రైనింగ్ అండ్‌ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ హెచ్‌ఓడీ, ఆటో మొబైల్ విభాగం సీనియర్ లెక్చరర్ తదితరులు జాబ్‌మేళాను పర్యవేక్షించారు. శనివారం కూడా హెచ్ఎల్ మాండో ఆనంద్ కంపెనీ జాబ్‌మేళాను నిర్వహిస్తుందని కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు.


వీల్స్ ఇండియాలో శిక్షణకు ఎంపికైన విద్యార్థులు

సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే బుర్రా భేటీ

- తనపై చేసిన దుష్ప్రచారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే బుర్రా వెల్లడి

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ శుక్రవారం వెలగపూడిలో అసెంబ్లీ వద్ద కలిశారు. ఎమ్మెల్సీ ఓటింగ్ విషయంలో తనపై దుష్ప్రచారం చేయడం వెనుక దాగిన కుట్రను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా 'నువ్వేంటో నాకు తెలుసు' అని ఆప్యాయతతో హత్తుకున్నట్లు బుర్రా వెల్లడించారు.

కుట్రలు చేసేవారు దహించుకుపోతారు

'నేను ఇద్దరినే నమ్ముకున్నా.. ఒకరు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి, మరొకరు నా రాజకీయ దేవుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి' అని ఎమ్మెల్యే బుర్రా పేర్కొన్నారు. సీఎంతో భేటీ అనంతరం విలేకర్లతో మాట్లాడారు. కనిగిరి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు తనకు మెండుగా ఉన్నాయని.. వారి ఆశీస్సులు ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. తనపై దుష్ప్రచారం చేయిస్తూ కుట్రలు పన్నుతున్నవారు.. నిలువునా దహించుకుపోతారని చెప్పారు. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారని, తాను కష్టపడి పైకి వచ్చిన వాడినన్నారు. వైఎస్ జగన్ తిరిగి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణులుకావాలి

- డీఈఓ రమేష్

మద్దిపాడు: పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ పీ రమేష్ అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, పైపాలెం ఎంపీపీ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. గుండ్లాపల్లి పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులను ఆయన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పాఠశాల ఉపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యనేర్పే దిశగా ఉపాధ్యాయులు ఉపక్రమించాలన్నారు. కింది తరగతుల విద్యార్థులు రాయలేకపోతున్నారని వారికి రాయడం, చదవడం ముందు నేర్పించాలని అన్నారు. కరోనా సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కింది తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి రాయడం చదవడం నేర్పించాలని డీఈవో సూచించారు. మద్దిపాడు పైపాలెం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులతో కొన్ని పదాలు రాయించారు. వారు సక్రమంగా రాయకపోవడంతో ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయుని మందలించారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫేర్ వెల్ కార్యక్రమానికి హాజరై పదో తరగతి విద్యార్థులకు దోస్తీ ఫౌండేషన్ ద్వారా షేక్ మహబూబ్ బాషా స్టేట్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ అందిస్తున్న పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, కంపాస్ బాక్స్ పెన్ను పెన్సిల్స్ అందించారు. కార్యక్రమంలో ఆయన వెంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పీ రమేష్

మాతృమరణాలను నివారించాలి

- డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: మాతృమరణాలను నివారించాలని ఆ మేరకు హైరిస్క్ గర్భిణులను పర్యవేక్షిస్తూ తగిన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రసవాలు ఆస్పత్రుల్లో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణి అయినప్పటి నుంచి ప్రసవం అయి తల్లీబిడ్డ క్షేమంగా ఉండే వరకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స, మందులు వాడాలన్నారు. సమావేశంలో గైనకాలజిస్టులు, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- ప్రతి ఆర్‌బీకే పరిధిలో సేంద్రియ వ్యవసాయం జరగాలి
- వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో సేంద్రియ వ్యవసాయం పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ అళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో అర ఎకరా నుంచి ఎకరా వరకు సేంద్రియ వ్యవసాయం కచ్చితంగా సాగయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలన్నారు. పాత కార్డులు రెన్యువల్ చేసి రైతులకు పంట రుణాలు ఇప్పించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు రుణాలు ఇప్పించాలని సూచించారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, మత్స్య శాఖలు రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. రైతులను చిరుధాన్యాల సాగు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలకు తీసుకువెళ్లి దాని వల్ల కలిగే లాభాలు తెలియచేయాలన్నారు. జిల్లాలో ఎక్కువగా సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి గ్రామాల్లో ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఉద్యానవన అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి గ్లోరియా పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, రవీంద్రరెడ్డి, జేసీ అభిషిక్త్‌కిషోర్

సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాల నివారణ

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ప్రకాశం భవనంలో రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ-డార్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే వినియోగంలో ఉన్న ఐ-రాడ్ అప్లికేషన్ మరింత అప్‌డేట్ చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు ముమ్మరం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ చందర్, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఆర్ఎంఓ చైతన్యవర్మ, పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, రోడ్లు భవనాలు, రవాణాశాఖ, ట్రాఫిక్ విభాగం అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వరరావు

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ్ (కేజీబీవీ) పాఠశాలల్లో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు అర్హులైనవారి నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడిమానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్, ఆర్ఫన్స్ అండ్ సెమీ ఆర్ఫన్స్ బాలికలే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటామని.. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

ఎంపికైన విద్యార్థినులకు వారు నమోదు చేసిన సెల్‌ఫోన్ నెంబర్‌కు మెసేజ్ పంపిస్తామని వివరించారు. అంతే కాకుండా సంబంధిత పాఠశాల నోటీసు బోర్డులో కూడా ఉంచుతామన్నారు.

ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు

* జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక
* సింగరాయకొండ మండలంలో సుడిగాలి పర్యటన

సింగరాయకొండ: జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకోని లబ్ధిదారుల నివేశన స్థలం పట్టాలు చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సింగరాయకొండ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. సోమరాజుపల్లి పంచాయతీ నర్రావానిపాలెం లేఔట్‌లో శుక్రవారం లబ్ధిదారులు, అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక, ఇనుము కొరత లేదని, బిల్లులు కూడా వేగంగా మంజూరు చేస్తున్నామని, డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.35 వేల రుణం అందజేస్తున్నట్లు తెలిపారు. లేఔట్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. అయినా గృహ నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను లబ్ధిదారులు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారికి ఇళ్లు ఉచితంగా నిర్మించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని, ఎస్టీలకు ఒకే చోట ప్లాట్లు కేటాయిస్తే పనులు ప్రారంభించేలా చూస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాతసింగరాయకొండ సచివాలయాన్ని పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించారు. తదనంతరం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి.కృష్ణవేణి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆశీర్వచనం అందజేసి ఘనంగా సత్కరించారు.



సైన్స్ గ్రూపులు ప్రారంభించాలని కలెక్టర్‌ను కోరుతున్న విద్యార్థినులు

నాడు–నేడు పనుల నాణ్యతలో రాజీపడొద్దు

పాతసింగరాయకొండ జెడ్పీ హైస్కూల్లో నాడు–నేడు పనులను పరిశీలించిన కలెక్టర్ నాణ్యతలో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి డీఎల్‌డీఓ ఉషారాణి, మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ పేరయ్య, ఈఈ ప్రసాద్, డీఈ జయరావు, ఏఈ నాగరాజు, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, తహసీల్దార్ సీహెచ్ ఉష, పీఆర్ ఏఈ శ్రీహరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైల్వే భూసేకరణ బాధితులు

అందరికీ ఒకేలా పరిహారం ఇవ్వండి

రైల్వే మూడో లైను ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఒకే విధంగా అందించాలని బాధిత రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఫేజ్–1లో సెంటుకు రూ.11 వేలు ఇవ్వగా, రెండో ఫేజ్‌లో మాత్రం రూ.78 వేలు ఇచ్చారని స్థల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లెక్కన పరిహారం తీసుకుంటే కోట్ల రూపాయలు తేడా వస్తోందని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, రైల్వే ఇంజినీరింగ్ అధికారి ఓఆర్ సురేష్, రైల్వే కాంట్రాక్టర్ అశోక్ ఉన్నారు.

ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రారంభించాలి

సింగరాయకొండ మండల పర్యటనలో భాగంగా తొలుత స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు తిరిగి ఏర్పాటు చేయాలని పదో తరగతి విద్యార్థులు కోరగా సానుకూలంగా స్పందించారు. 82 మంది విద్యార్థినుల్లో 80 మంది బైపీసీ, ఎంపీసీలో చేరతామని చెప్పగా.. సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగ నాగార్జున, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ సెక్రటరీ పావనమూర్తితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. రాష్ట్రంలో 4 పాఠశాలల్లో కొత్తగా సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లా నుంచి ప్రతిపాదనలు వస్తే అనుమతి మంజూరుకు కృషి చేస్తామని వారిద్దరు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ స్పందించిన తీరుపై విద్యార్థినులు ముగ్ధులై కృతజ్ఞతలు తెలిపారు.



నర్రావానిపాలెం జగనన్న లేఔట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గుడ్ ట్రయల్ మానిటరింగ్‌తో నేరస్తులకు శిక్ష

* కోర్టు ట్రయల్ కేసులపై అలసత్వం తగదు
* పోలీస్ అధికారులతో సమీక్షలో ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: న్యాయస్థానాల్లో వివిధ దశల్లో ఉన్న కేసుల విషయంలో అలసత్వం వహించవద్దని ఎస్పీ మలికా గర్గ్ స్పష్టం చేశారు. శుక్రవారం ట్రయల్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై న్యాయస్థానాల్లో జరుగుతున్న ట్రయల్ తీరుతెన్నులు, కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడం, పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూల అమలు తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కోర్టుల్లో వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన వెంటనే సీసీ, పీఆర్సీ నంబర్లు తీసుకోవాలని, ఆర్‌ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల వివరాలను వెంటనే తెప్పించుకోవాలని, సాక్షులకు సకాలంలో సమన్లు అందజేయాలని స్పష్టం చేశారు. కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టాలని, ముద్దాయిల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్ల కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, ఎన్బీడబ్ల్యూస్‌ను సక్రమంగా అమలు చేయడంలో అలసత్వం వీడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) ఎస్‌వీ శ్రీధరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



వీసీలో పాల్గొన్న పోలీసు అధికారులు

25 లోగా అప్‌డేట్ చేసుకోవాలి

ఒంగోలు: జగనన్న విద్యాదీవెన కింద నిధులు విడుదల కాని షెడ్యూలు కులాల విద్యార్థులు తమ వివరాలను ఈనెల 25 లోగా తమ పరిధిలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి షెడ్యూలు కులాల విద్యార్థులకు గతంలో తల్లుల ఖాతాలో నిధులు జమ చేస్తారని, ప్రస్తుతం విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇంకా 2460 మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్‌పీసీఐ అనుసంధానం కాకపోవడం వల్ల జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల కాలేదన్నారు. విద్యార్థులు తమ బ్యాంకు వివరాలను ఆయా గ్రామ వార్డు సచివాలయాల్లో అందజేయని వారు ఈనెల 25 లోపు పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్‌చేసి తమ పరిధిలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో పోస్టల్ అకౌంట్ అప్‌డేట్ చేసుకోవాలని వివరించారు. ఎన్‌పీసీఐ అనుసంధానం అయిన విద్యార్థులకు త్వరలో విద్యాదీవెన నిధులు విద్యార్థుల ఖాతాకు జమ చేస్తారని వివరించారు. కాలేజీల యాజమాన్యం వారు ఈ విషయాన్ని గమనించి ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఇతర కులాలకు చెందిన ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ వర్గాల విద్యార్థులకు గతంలో మాదిరే విద్యార్థుల తల్లుల ఖాతాకి రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన , జగనన్న వసతి దీవెన నిధులు.. ఎన్‌పీసీఐ ప్రకారం ఆధార్‌తో అనుసంధానం అయిన తల్లి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి ఇంకా 247 మంది తల్లులు ఎన్‌పీసీఐ ప్రకారం ఆధార్‌తో వారి బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకోలేదన్నారు. ఈనెల 21న జరిగిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీ సాంఘిక సంక్షేమశాఖ నిర్వహించిన సమీక్షలో షెడ్యూలు కులాల విద్యార్థుల బ్యాంకు ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేయించాలని సూచించినట్లు లక్ష్మానాయక్ వివరించారు.